

సఖీ కేంద్రంలో కేసుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

# ఆమెకు అండగా 'సఖీ'

- మహిళలకు భరోసా కల్పిస్తున్న తెలంగాణ ప్రభుత్వం
- సమస్యల పరిష్కారానికి వేదికగా 'సఖీ'కేంద్రాలు
- ఉచితంగా కౌన్సెలింగ్, న్యాయ, వైద్య సేవలు
- బాధితులకు అండగా 24 గంటలు అందుబాటు



మెదక్‌లోని సఖీ కేంద్రం

మెదక్ రూరల్, డిసెంబర్ 1: కుటుంబంతోపాటు పని చేసే ప్రదేశం సహా పలు చోట్ల మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురవుతున్న మహిళలు, యువతులు, బాలికలకు మేమున్నామంటూ బాసటగా నిలుస్తున్నాయి 'సఖీ'కేంద్రాలు. పనిచేసే పలు చోట వేధింపులకు గురై బయటకు చెప్పుకోలేని ఎందరో మహిళలు, యువతులకు మనోధైర్యం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం 'సఖీ' కేంద్రాలను ఏర్పాటు చేసి చేయూతనిస్తున్నది. దీనిలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెదక్‌లో సెప్టెంబర్ 2019లో 'సఖీ'కేంద్రం ఏర్పాటు చేసింది. వ్యక్తిగత సమస్యలతో వచ్చేవారికి న్యాయపరమైన సూచనలు ఇవ్వడంతో పాటు ఎన్నో రకాల సేవలను అందిస్తూ.. జీవితాలకు భరోసానిస్తున్నాయి 'సఖీ'కేంద్రాలు. న్యాయ, వైద్య, పోలీసు శాఖల సమన్వయంతో ఈ సేవలను ఉచితంగా అందిస్తున్నాయి.

**రూ. 73.15 లక్షల వ్యయంతో 'సఖీ'భవనం**

మెదక్ జిల్లా కేంద్రంలో ఇటీవల రూ.73.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన 'సఖీ'భవన కేంద్రాన్ని రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

**టోల్ ఫ్రీ నంబర్ 181**

'సఖీ'కేంద్రాలకు రాలేని మహిళల కోసం హెల్ప్‌లైన్ నంబర్ సైతం ఏర్పాటు చేశారు. సమస్యల్లో ఉన్న మహిళలు టోల్ ఫ్రీ నంబర్ 181ను లేదా మెదక్ సఖీ కేంద్రం నంబర్లు 08452-295181, 9346146580, సంప్రదించవచ్చు. ఇది 24గంటలు అందుబాటులో ఉంటుంది. ఏ సమయంలోనైనా బాధితులు ఫోన్ ద్వారా సంప్రదిస్తే.. వారున్న ప్రదేశానికే ఓ వాహనం వస్తుంది. ఈ వాహనంలో ఒక మహిళా కానిస్టేబుల్‌తో పాటు మానసిక నిపుణులు సైతం ఉంటారు. వీరు బాధితులకు భరోసానిస్తూ 'సఖీ'కేంద్రానికి తీసుకెళ్తారు.

**లభించే సేవలు**

హింస, వేధింపులు బారిన పడ్డ వారికి నేషనల్ హెల్త్ మిషన్, 108, పోలీసులతో అత్యవసర సేవలు అందించడం, వారిని కాపాడిన తర్వాత ఆశ్రయం కల్పించడం కోసం సమీపంలోని హోమ్‌లకు తరలించడం బాధితులకు వైద్య సేవలు అందించేందుకు సమీప దవాఖానలకు పంపించడం వంటి సేవలు 'సఖీ'కేంద్రం అందిస్తున్నది. వారికి అవసరమయ్యే పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహిస్తారు. తాత్కాలింగా మహిళా హోంలలో ఆశ్రయం కల్పించి, కనీసం ఐదు రోజులకు తక్కువ కాకుండా వసతి కల్పిస్తారు. బాధితులు కోర్టు ప్రొసిడింగ్స్‌కు హాజరుకాలేని పరిస్థితుల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో తమ వాదనలు వినిపించే సౌకర్యాన్ని 'సఖీ'కేంద్రం కల్పిస్తుంది.

## అందించిన సేవలు

| | |
|---|---|
| వైద్య సాయం అందించిన కేసులు | 422 |
| న్యాయ సహాయం | 188 |
| పోలీస్ మద్దతుతో కేసులు | 148 |
| సైకో సోషల్ కౌన్సిలింగ్ కేసులు | 1932 |
| మెడికల్ సర్వీస్‌తో కేసులు | 422 |
| ఆశ్రయం అందించిన కేసులు | 424 |
| డీఐఆర్ కేసులు | 11 |
| ఫోక్సో కేసులు | 36 |
| స్వధార్ గ్రేస్ కేసుల సంఖ్య | 27 |
| రెస్క్యూ కేసుల సంఖ్య | 259 |
| అందించిన కిట్‌లు | 214 |

## ఎలా సంప్రదించాలి..

మహిళలు, యువతులు తమకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైన 'సఖీ'కేంద్రాన్ని ఆశ్రయించవచ్చు. ఇక్కడ సరైన కౌన్సిలింగ్‌తో పాటు న్యాయపరమైన, పోలీసు సహకారంతో కోర్టు ద్వారా పరిష్కారం పొందే అవకాశాలు ఉన్నాయి. సెంట్రల్ అడ్మిన్‌తో పాటు సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారు. బాధితులు 181కుగాను 100కి గాను సమాచారం అందిస్తే అవసరమైన సేవలు అందించేందుకు 'సఖీ' కేంద్రం సమాయత్తం అవుతుంది. అవసరాన్ని బట్టి బాధితులకు వాహనం అందుబాటులో ఉంటుంది.



సఖీ కేంద్రం 181 వాహనం

## పరిష్కారమైన వివిధ కేసులు

- 2019 సెప్టెంబర్ నుంచి 2023 అక్టోబర్ 17 వరకు 940 కేసులు నమోదు కాగా అందులో 810 కేసులు పరిష్కరించగా, 130 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.
- 309 అవగాహన సదస్సులు నిర్వహించి 87,669 మందికి 'సఖీ'సేవల గురించి తెలియజేశారు.

## మహిళా భద్రత ప్రభుత్వం పెద్దపీట..



మహిళా భద్రత కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నదని అందులో భాగంగా మహిళలు, యువతులకు అండగా ప్రభు త్వం 'సఖీ' కేంద్రాలు ద్వారా సేవలు అందించడం జరుగుతున్నదన్నారు. ఇటీవల మెదక్ జిల్లా కేంద్రంలో రూ 73.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన 'సఖీ' భవన కేంద్రం ప్రారంభించడం జరిగింది. మహిళలకు ఎలాంటి సమస్యలు ఎదురైన తక్షణమే సాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 181కు కాల్ చేయాలి. బాధితులు ఆధైర్యపడకుండా 'సఖీ'కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– పద్మా దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే, మెదక్

## కుటుంబ కలహాల కేసులే అధికం



బాధిత మహిళలు ఫోన్ ద్వారా సమాచారం అందించిన వెంటనే స్పందిస్తున్నాం. వారికి తగిన రక్షణ కల్పించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. సఖీ కేంద్రానికి వచ్చే మహిళలకు అవసరమైన మేరకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం. కేంద్రానికి వచ్చే బాధితుల్లో ఎక్కువ మంది కుటుంబ కలహాల సమస్యలతో వస్తున్నారు. విద్యాసంస్థల యజమాన్యాలు, అంగన్‌వాడీ టీచర్లు, సమైక్య మహిళా సభ్యుల సహకారంతో సేవలను మరింత విస్తృతం చేస్తున్నాం.

– రేణుక, సఖీ కేంద్ర నిర్వాహకురాలు

## 24 గంటలు అందుబాటులో సేవలు



వేధింపులకు గురైన బాధిత మహిళలకు అండగా నిలచి వారికి భరోసా కల్పించడానికే సఖీ కేంద్రం పని చేస్తుంది. ఆపదలో ఉన్న మహిళలు, యువతులు నిర్భయంగా టోల్ ఫ్రీ నంబర్181కు కాల్ చేస్తే, వారికి అవసరమైన సేవలు అందిస్తాం. సఖీ సెంటర్లలో సేవలు అందించేవారు 24 గంటలు అందుబాటులో ఉంటారు. బాధితుల పక్షాన ఎవరైనా ఫోన్ చేసిన వెంటనే స్పందిస్తాం. సదరు వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– బ్రహ్మజీ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి, మెదక్



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న సఖీ కేంద్రం నిర్వాహకులు



సఖీ కేంద్రంలో కేసుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి (ఫైల్)



నర్సాపూర్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో చర్చిస్తున్న సునీతాలక్ష్మారెడ్డి

# పోలింగ్ సరళిపై సునీతాలక్ష్మారెడ్డి ఆరా

నర్సాపూర్, నవంబర్1: నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని ఆమె నివాసంలో బీఆర్‌ఎస్ శ్రేణులతో పోలింగ్ సరళి, గెలుపు అవకాశాలపై చర్చించారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని 8 మండలాలలో బీఆర్‌ఎస్ పార్టీకి ఎన్ని ఓట్లు పోలయ్యాయనని కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. నర్సాపూర్ నియోజకర్గంలో బీఆర్‌ఎస్ పార్టీనే గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయని కార్యకర్తలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలతో అధైర్యపడవద్దని బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆమె కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరులో శ్రీవిశ్వయోగి విశ్వంజి మహరాజ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ శివకుమార్‌గౌడ్

# 7న గురుపీఠం శిలాన్యాసం

శివ్వంపేట, డిసెంబర్ 1: శివ్వంపేట మండలం గూడూరులో 7వ తేదీన నిర్వహించే శిలాన్యాసం కార్యక్రమానికి హాజరుకావాలని శుక్రవారం గుంటూరులో విశ్వయోగి విశ్వంజీ మహరాజ్‌కు శ్రీగురుపీఠం చైర్మన్ శివకుమార్‌గౌడ్, వేద పండితులు, మేనేజింగ్ ట్రస్టీ శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆహ్వాన పత్రిక అందజేశారు. 7వ తేదీ ఉదయం 8:40 నిమిషాలకు శిలాన్యాసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, తగిన ఏర్పాట్లు చేశామని శివకుమార్‌గౌడ్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీగురుపీఠం శిలాన్యాసం విజయవంతం చేయాలని కోరారు. వారి వెంట ట్రస్టు సభ్యుడు మార్లెళ్ల మోహన్‌రావు ఉన్నారు.



పెద్దశంకరంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

# ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

పెద్దశంకరంపేట/రామాయంపేట, డిశంబర్1: 'ప్రపంచ ఎయిడ్స్ డే' సందర్భంగా పెద్దశంకరంపేటలో శుక్రవారం పీహెచ్‌సీ సిబ్బంది, పాఠశాల విద్యార్థు లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ అసుపత్రి నుంచి పట్టణ పురవీధుల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు గ్రేసీ, శ్రీదేవి, హెచ్‌ఈ యాదయ్య, సిబ్బంది సాయిలు, భూమయ్య, వెంకటేశం, పాల్గొన్నారు.

- రామాయంపేట పట్టణంతో పాటు పలు గ్రామాల్లో 'ప్రపంచ ఎయిడ్స్ డే' సందర్భంగా పాఠశాల విద్యార్థులతో ఆరోగ్య సిబ్బంది ఊరేగింపులు నిర్వహించారు. శుక్రవారం డి.ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు హరిప్రియ నేతృత్వంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, యువతకు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ ర్యాలీలో వైద్యులు, ప్రదీప్, సుకేషిణి, ఆరోగ్య సిబ్బంది ప్రభుత్వ పాఠశాలల టీచర్లు తదితరులున్నారు.



రామాయంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు